క్లుప్తంగా

నేడు డయల్ యువర్ చైర్మన్

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు బుధవారం డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమం చేపడుతున్నామని చైర్మన్ నర్సింహగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని వివరించారు. సెల్ నంబర్: 9640349097కు ఫోన్ చేయాలని కోరారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సర్పంచ్ నిరంజన్, పంచాయతీ కార్యదర్శి పవన్‌లు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని హెచ్‌ఎంకు సూచించారు.

కలెక్టర్‌కు వినతి



కోడేరు: మండలంలోనే మాచుపల్లి గ్రామాన్ని కొనసాగించాలని బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బాల్‌చందర్, రాము మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అవుతున్న ఏదుల మండలంలో మాచుపల్లి గ్రామాన్ని కలిపితే గ్రామస్తులు ఇబ్బందులు పడుతారని వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణ, పరుశరాముడు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కోడేరు: మండలంలోని గుండ్యావాల్యానాయక్ తండాలో శ్మశాన వాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులతో శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ శంకర్, ఉప సర్పంచ్ ఆనంద్, వార్డు సభ్యులు జయమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మురళీమోహన్ బాధ్యతలు



తెలకపల్లి: మండల తహసీల్దార్‌గా మురళీ మోహన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మూడు రోజుల కిందట మునీరుద్దీన్ తెలకపల్లి తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్నారు. రెండు రోజులు గడవకుముందే తహసీల్దార్ మునీరుద్దీన్‌ను అచ్చంపేట ఆర్డీఓ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లిలో డీటీగా విధులు నిర్వర్తిస్తున్న మురళీమోహన్ పదోన్నతిపై మండలానికి వచ్చారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం



తెలకపల్లి: బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆర్ శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాకొండలో ప్రచార రథం ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బహుజనులంతా ఒక్కతాటిపైకి రావాలని సూచించారు. ఇన్నేళ్ల నుంచి అగ్ర కులస్తుల పార్టీలు బహుజనులకు అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలనాగయ్య, మల్లేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

లింగాల: మండలంలోని అవుసలికుంటలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ బండి ఎల్లయ్య ప్రారంభించారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.61 లక్షలు మంజూరు చేయించారని సర్పంచ్ తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు మధు, పార్వతయ్య, శ్రావణ్‌కుమార్, రాజు, విష్ణు, అంజి, శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా నాయకుడు మహ్మద్ యూసుఫ్ మంగళవారం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ సమక్షంలో చేరారు.



అచ్చంపేటలో బోనమెత్తిన ప్రభుత్వ విప్ బాలరాజు సతీమణి అమల



పోతురాజులతో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



బిజినేపల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కర్ణాటక ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియాన్

అమ్మా.. కరుణించు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భ్రమరాంబ దేవాలయం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భ్రమరాంబ దేవాలయం నుంచి మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. పోతురాజు వేషధారణలు అలరించాయి. వివిధ కాలనీల నుంచి మహిళలు బోనాలు ఎత్తుకుని ర్యాలీగా పోచమ్మ గుడి వద్దకు వచ్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి గువ్వల అమల బోనమెత్తారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు మనోహర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లపు శ్రీనివాసులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో రెండో రోజు మంగళవారం బోనాల పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం రేణుక ఎల్లమ్మకు మహిళలు బోనాలను డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. బొడ్రాయి, కోట మైసమ్మ వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎల్లమ్మ దేవాలయం వద్ద అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో పోచమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, సీపీఐ నాయకులు బొల్లెద్దుల శ్రీనివాస్, విజ్జయ్య, శ్రీరాములు, ఆంజనేయులు, పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి దేవల్‌తిరుమలాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో పోచమ్మ బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని పోచమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లారు. కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామాల్లో పండుగ సందడి కనిపించింది.

బిజినేపల్లి: మండలంలోని ఖానాపూర్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవంలో కర్ణాటక ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియాన్ హాజరై సందడి చేశారు. పోతురాజు విన్యాసాలు, బోనాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పాల్గొన్నడం తన అదృష్టంగా భావిస్తునట్లు ఎమ్మెల్యే ఉమానాథ్ కోటియాన్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు జాకీర్ హుస్సేన్, తిరుపతయ్య, సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పథకాలతో మోసపోవొద్దు



మన్ననూర్: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలతో ప్రజలు మోసపోవొద్దని అమ్రాబాద్ మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, ఎంపీటీసీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిని ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ పాలకులు ప్రజల సొమ్ము వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. పది ఏళ్లుగా అమలు చేయని పథకాలు ఎన్నికల కోసం హడావిడి చేస్తున్నారనేది ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు వెంకటరమణ, శివాజీ, వెంకటయ్య, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సుస్థిరత



కొల్లాపూర్: డబుల్ ఇంజిన్ సర్కారుతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే రాజేష్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జరిగే అభివృద్ధి, సంక్షేమం గూర్చి ప్రజలకు తెలపాలని సూచించారు. కష్టపడి పనిచేస్తే కొల్లాపూర్‌లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. జగపతిరావు, కేతూరి నారాయణ, కాకి సత్యనారాయణగౌడ్, కల్పనారెడ్డి, కాశీపురం మహేష్, బాలకృష్ణయాదవ్ తదితరులున్నారు.

వైభవంగా మహాభోగ్ బండారు

వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండాలో వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ ఆలయాల్లో మంగళవారం మహాభోగ్ బండారు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు హోమం నిర్వహించారు. గిరిజనులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పూజారి తరుణ్ స్వామి, నాయకులు రమేష్, భక్యానాయక్, లోక్యా, రాజు, చంద్రు, సర్య, రవి, లక్పతి, ఆంజనేయులు ఉన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని మొకురాల గ్రామానికి చెందిన పద్మమ్మకు ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ బస్తాలు, సీకును, ఇసుకను ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంగళవారం పంపిణీ చేశారు. జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్, తదితరులు ఉన్నారు.

నాటుకోళ్ల పెంపకంపై చెంచులకు శిక్షణ



దోమలపెంట: నల్లమలలోని అప్పాపూర్‌లో నివసిస్తున్న చెంచు మహిళలకు నాటుకోళ్ల పెంపకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నాబార్డు డీడీఎం అఖిల్, ఎల్‌డీఎం కుశాల్ కౌషిక్ ప్రారంభించారు. చెంచులు అడవి మీద ఆధారపడకుండా జీవనోపాధి పెంపొందించుకునేందుకు నాటుకోళ్ల శిక్షణను ఇస్తున్నట్లు మిరాకిల్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ మహమ్మద్ జావేద్ అన్నారు. నవంబర్‌లో ఒక్కో చెంచు కుటుంబానికి ఇరవై కోడి పిల్లలు, దాణా ఇస్తామని పేర్కొన్నారు. గవర్నర్ తమిళిసై అప్పాపూర్ చెంచు పెంటను దత్తత తీసుకున్నారన్నారు. గవర్నర్ సూచనల మేరకు నాబార్డు వారి సహకారంతో పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ వంశీ, చెంచులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హనుమంత్‌రెడ్డి తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కంపచెట్ల తొలగింపు

కల్వకుర్తిరూరల్: పట్టణం నుంచి ఎల్లికల్‌కు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను మంగళవారం మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, కౌన్సిలర్ రవీందర్‌లు సిబ్బందితో తొలగింపజేశారు. అదేవిధంగా గుండెపోటుతో మరణించిన రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరికి చెందిన ఈశ్వరయ్య కుటుంబానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమకూర్చిన రూ.10 వేలు బాధిత కుటుంబానికి మార్కెట్ చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, అంజయ్యగౌడ్, పరశరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 28 వరకు చివరి అవకాశం ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 25 సీట్లు ఉండగా అందులో ఎస్సీ-20, ఎస్టీ-1, బీసీ-3, ఓసీ-1, బైపీసీలో ఎస్సీ-02, ఎస్టీ-2, మైనార్టీ-1 సీటు ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై జీపీఏ 7.0 నుంచి పై గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల బైపీసీ విభాగంలో ప్రవేశాల కోసం ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అకుల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరంలో 10వ తరగతి పాసైన ఎస్సీ విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు టీసీ, బోనఫైడ్, మెమో, కులం, ఆదాయం, స్థానిక ధ్రువపత్రం, విద్యార్థి, తండ్రి ఆధార్ కార్డు జిరాక్స్, నాలుగ పాస్ ఫొటోసైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అథ్లెటిక్స్‌లో నల్లమలవాసి ప్రతిభ

అమ్రాబాద్: సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో నల్లమల వాసి దాసరి ఆంజనేయులు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాడు. అమ్రాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి ఆంజనేయులు షాట్‌పుట్ విభాగంలో ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపక బృందం హర్షం ప్రకటించారు.

మొక్కలు నాటాలి

బిజినేపల్లి: ఆలయాల చుట్టూ మొక్కలు నాటాలని ఎంపీడీవో కృష్ణయ్య సూచించారు. మంగళవారం మండలంలోని నందివడ్డెమాన్ శనేశ్వరాలయంలో మొక్కల నాటే ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. మామిడి, రావి, వేప, జమ్మి, మర్రి వంటి మొక్కలతో పాటు మరిన్ని మొక్కలను నాటాలని కోరారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించి వాటిపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీటీఏ రాజేష్, పంచాయతీ కార్యదర్శి, ఎఫ్ఏలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని అగ్రగామిగా నిలుపుదాం

అచ్చంపేట రూరల్: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపాలిటీని అగ్రగామిగా నిలుపుదామని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వారి నుంచి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గతంలో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు.



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలి



అచ్చంపేట రూరల్: నూతన పీఆర్‌సీని ప్రకటించి ఐఆర్ ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిళ్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రావు, సతీష్, రాజు, నందకిషోర్, సత్యనారాయణ, శంకరయ్య, శ్రీను, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో మంగళవారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీజ్‌ను ఎనిమిది రోజుల పాటు పూజించి తొమ్మిదొవ రోజు మొలకల నిమజ్జనం చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా పెళ్లి కాని బంజార యువతులు వెదురు బుట్టలలో పుట్ట మట్టిని పోసి అందులో నవధాన్యాలు చల్లి 9 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేశారు. గ్రామంలోని మేరమ్మ గుడి ప్రాంగణంలో తీజ్ బుట్టలను ఏర్పాటు చేశారు. చివరి రోజు గిరిజన యువతులు తీజ్ బుట్టలను ఎత్తుకొని వీధుల గుండా ఊరేగింపు నిర్వహించి మొలక బుట్టలను సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అదే విధంగా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ అందజేత



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాయిలీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం అయ్యింది. ఈ సందర్భంగా మంగళవారం వైద్యులు సంతోష్, అభిరాం కేసీఆర్ కిట్‌ను అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు సురక్షితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న విజయలక్ష్మి

కొల్లాపూర్: పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 12 వవార్డులో సీసీ రహదారి, మురుగుకాల్వ నిర్మాణాలకు మంగళవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఆమె వెంట మున్సిపల్ ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, నాయకులు ఎల్లగౌడ్, కురుమూర్తి, బాషా, శివ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా 2023 విద్యా సంవత్సరంలో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే మైనార్టీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్స్, సిక్కు, జైన్, బౌద్ధం, పారసీలు) ముఖ్యమంత్రి విద్యాపథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు వచ్చేనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా మైనార్టీ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

కొల్లాపూర్ రూరల్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో పాలమూరు ప్రాజెక్టు పనులు చేస్తున్న మెగా క్యాంపులో దోమ కీటక నాశక సంహారక మందును స్ప్రే చేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందంటే దోమ కాటు వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు, బోధకాలు సంభవించే అవకాశం ఉందన్నారు.

బీసీలకు అన్యాయం

కల్వకుర్తిరూరల్: సీఎం కేసీఆర్ ప్రకటించిన వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల లిస్ట్‌లో బీసీలకు తీరని అన్యాయం చేశారని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం 23 మంది బీసీలకు మాత్రమే టికెట్లు కేటాయించడం సరికాదన్నారు. 50 మంది బీసీ అభ్యర్థులను ప్రకటించాలని కోరారు.

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు కురుమలకు ఒక్క సీటు కూడా బీఆర్‌ఎస్ కేటాయించకపోవడం దారుణమని రాష్ట్ర నాయకుడు చంద్రమౌళి, శివప్రసాద్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 14 శాతం ఉన్న కురుమ కులస్తులకు అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా కురుమలకు న్యాయం చేయాలని లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02వ సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకోవడం సంతోషం వ్యక్తం చేశారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు.

ఎమ్మెల్యే అభ్యర్థి కోసం సుంకిరెడ్డి దరఖాస్తు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని నేతల దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యేను కలిసిన చైర్మన్

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి శాసనసభ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేరు ఖరారు కావడంతో ఈ మేరకు మంగళవారం పీఏసీఎస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

గోపాల్‌పేట: రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బీజేపీ సత్తా చాటాలని కర్ణాటక రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే హెచ్‌కే సురేష్ అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

సీఎం కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాలు బేజారు



అచ్చంపేట బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

అచ్చంపేట రూరల్: సీఎం కేసీఆర్ వ్యూహాలకు ప్రతిపక్షాలు బేజారవుతున్నాయని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సీఎం కేసీఆర్ అచ్చంపేట అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గువ్వల బాలరాజును మూడోసారి టికెట్ ఇవ్వడంపై మంగళవారం కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. గువ్వల బాలరాజు, ఆయన సమతీమణి గువ్వల అమలకు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గువ్వల బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి, తులసీరాం, లోక్యానాయక్, రమేష్‌రావు, అమీనొద్దిన్, మోక్తాల వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: అచ్చంపేట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గువ్వల బాలరాజు ప్రకటన తర్వాత నియోజకవర్గానికి గువ్వల రావడంతో మండల నాయకులు తాండ్ర సమీపాన శ్రీశైలం ఎక్స్ రోడ్డు వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, సర్పంచ్‌లు విజేందర్ గౌడ్, నరేష్ నాయక్, ప్రశాంత్, కోఆప్షన్ సభ్యులు సలీం, నాయకులు రాంకొండ, రమేష్ నరేందర్ రెడ్డి ఉన్నారు.

ఉప్పునుంతల: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మూడోసారి అచ్చంపేట ఎమ్మెల్యే టికెట్ ఖారారు కావడంతో మండల కేంద్రంలో మంగళవారం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ర్యాలీగా వెళ్లి స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రావు, సర్పంచ్‌లు బాలు నాయక్, రమేష్‌రెడ్డి, పర్వతాలు, శివుడు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నూతన మండలంగా ఏదుల

గోపాల్‌పేట: గోపాల్‌పేట మండలంలో గ్రామపంచాయతీగా ఉన్న ఏదుల గ్రామాన్ని ఎనిమిది రెవెన్యూ గ్రామాలతో కలిపి కొత్త మండలంగా ప్రకటిస్తూ.. మంగళవారం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఇందులో రేవల్లి మండలం నుంచి చెన్నారం, చీర్కపల్లి, గోపాల్‌పేట మండలం నుంచి ఏదుల, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి సింగాయపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకులపల్లి గ్రామాలను కలుపుతూ ఏదుల మండలాన్ని ఏర్పాటు చేశారు.